ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

వికారాబాద్ మోమిన్‌పేట	6.9
రంగారెడ్డి మంగల్‌పల్లి	7.6
మేడ్చల్- మల్కాజిగిరి కేశవరం	11.0



సీఎం రేవంత్‌రెడ్డికి మొక్కను అందిస్తున్న ఫ్యూచర్ సిటీ అథారిటీ కమిషనర్ శశాంక





సమ్మిట్‌లో అతిథుల సందడి



రెండు రోజుల పాటు హంగులు, ఆర్భాటాలతో కొనసాగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ మంగళవారం సాయంత్రం జరిగిన డ్రోన్ షోతో విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశాలకు 6 ఖండాలు, 44 దేశాలతోపాటు మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన దాదాపుగా 2 వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారు. చివరి రోజు బాలీవుడ్, టాలీవుడ్ నటుల రాకతో సందడిగా మారింది. 8, 9 తేదీల్లో జరిగిన సమావేశాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముగియడంతో అధికార యంత్రాంగా ఊపిరి పీల్చుకుంది. కాగా, నేటి నుంచి ఈ ప్రాంగాణాన్ని తిలకించేందుకు మూడు రోజుల పాటు సందర్శకులను అనుమతించనున్నారు.

సమ్మిట్ విజయవంతంపై హర్షం

గత 22 రోజుల పాటు 25 శాఖల అధికారులు శ్రమించి 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన గ్లోబల్ సమ్మిట్ సమావేశాలు విజయవంతం కావడంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. 8వ తేదిన ప్రారంభమైన సమావేశాలు మంగళవారం రాత్రి డ్రోన్ షోతో ముగిశాయి. కాగా, సమ్మిట్ ప్రాంగాణాన్ని తిలకించేందుకు నేటి నుంచి (బుధవారం) మూడు రోజుల పాటు సందర్శకులను అనుమతించనున్నారు.



రెండో రోజూ అదే సందడి



ప్రత్యేక ఆకర్షణగా డ్రోన్ షో

గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రోన్ షో అతిథులను ఆకట్టుకుంది. షోను తిలకిస్తున్న అతిథులు చప్పట్లు కొడుతూ డ్రోన్ షోను ఆసక్తిగా తిలకించారు. బేగరికంచ, మీర్ఖాన్‌పేట గ్రామాల ప్రజలు కూడా షోను ఆసక్తిగా తిలకించారు.

మీర్ఖాన్‌పేట్‌లో ముగిసిన రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- అలరించిన ప్రత్యేక డ్రోన్ షో
- తరలివచ్చిన పారిశ్రామికవేత్తలు
- ఆకట్టుకున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల స్టాల్స్
- నేటి నుంచి మూడు రోజుల పాటు సందర్శకులకు అనుమతి

రంగారెడ్డి అర్బన్/కందుకూరు/ షాద్‌నగర్/ మహేశ్వరం/ కొందుర్గు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది. దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, విద్యా రంగాలకు చెందిన వారు, విదేశీ రాయబారులు, ఆయా దేశాలకు చెందిన నిష్ణాతులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.ఈ సదస్సులో మంగళవారం ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీపై డాక్యుమెంటరీని ఆవిష్కరించింది. పెట్టుబడులు సైతం వెల్లువలా వస్తుండటం గమనార్హం. పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది.



ఫ్యూచర్ సిటీ నమూనాను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

అత్యాధునిక నగర నిర్మాణానికి..

ప్రభుత్వం.. భారత్ ఫ్యూచర్‌సిటీని అత్యాధునిక హంగులతో నిర్మించేందుకు అడుగులు వేస్తోంది. గ్లోబల్ సమ్మిట్‌లో ఎఫ్‌సీడీఏ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళిలను ప్రభుత్వం ప్రపంచం ముందు ఉంచింది. రానున్న రోజుల్లో శ్రీశైలం, నాగార్జునసాగర్ రెండు ప్రధాన రహదారులు, రాజధానికి అనుసంధానంగా 30వేల ఎకరాల్లో అత్యాధునక నగరాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కందుకూరు, మహేశ్వరం, యాచారం, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు మండలాల్లోని 56 గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాంతంలో రెసిడెన్సియల్, కమర్షియల్, ఇండస్ట్రీయల్, వినోద, గ్రీన్‌జోన్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. రియల్‌ఎస్టేట్ ప్రధానం కాకుండా అన్ని రంగాలను ఈ ప్రాంతంలో నెలకొల్పేలా చర్యలు చేపట్టనుంది.

టూరిజంపై ఫోకస్

దేశంలో క్రీడారంగం అభివృద్ధి

మిగతా 6వ పేజీలో...

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటుపై ప్రభుత్వం నవంబరు 18న నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఈ నెల 7వ తేదీ రాత్రి వరకు మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం చకచకా ఏర్పాట్లు పూర్తి చేసింది. అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని ఏర్పాట్లు చేశారు. రోడ్ల నుంచి అతిథులు బస చేసే హోటళ్ల వరకు అన్ని వసతులు, పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. సమ్మిట్ జరిగే సమీపంలోనే ఏడు ప్రాంతాల్లో పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేశారు. వీవీఐపీలు, వీఐపీలు వస్తున్న వాహనాలకు అంతరాయం కలుగకుండా అక్కడక్కడ ట్రాఫిక్‌ను మళ్లించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలోని పలు కూడళ్లతోపాటు మీర్ఖాన్‌పేట్‌లోని సమ్మిట్ జరిగే ప్రాంతం వరకు వేలాది వాహనాలు తరలిరావడంతో, అడుగడుగునా పోలీసులను అందుబాటులో ఉంచారు. రహదారిపై ట్రాఫిక్ పోలీసులు నిరంతరం వాహనాలకు నిలుపకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దేశ, విదేశాలకు చెందిన అతిథులు తిరిగి పయనం పట్టడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.



గ్లోబల్ సమ్మిట్ వద్ద భారీగా వాహనాల పార్కింగ్

తొలి విడతకు సిద్ధం

రేపు పంచాయతీ ఎన్నికలు ప్రారంభం

ఏర్పాట్లు చేసిన అధికారులు .. కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సన్నద్ధం అయ్యారు. బుధవారం పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ ఇచ్చి సిబ్బందిని పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, కొత్తూర్, కొందుర్గు, కేశంపేట, నందిగామా, జిల్లెడు చౌదరిగూడెం మండల పరిషత్ ఆఫీసుల్లో బ్యాలెట్ బాక్స్‌లతోపాటు ఇతర మెటీరియల్స్‌ను సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్‌కు ప్రారంభం అవుతుంది. 174 సర్పంచ్ స్థానాలకు ఆరు స్థానాలు ఏకగ్రీవం కాగా, 168 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 1,530 వార్డుల్లో 190 వార్డులు ఏకగ్రీవం కాగా 1,340 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. సర్పంచ్ స్థానాలకు 530 మంది, వార్డు స్థానాలకు 3,379 మంది పోటీ పడుతున్నారు.



బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేస్తున్న అధికారులు

కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లెడు చౌదరిగూడెం, శంషాబాద్ ఏసీపి శ్రీకాంత్‌గౌడ్ నేతృత్వంలో కొత్తూర్, నందిగామ మండలాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. షాద్‌నగర్ ఏసీపీ పరిధిలోని నాలుగు మండలాల్లో ఐదుగురు ఏసీపీలు, 16 మంది సీఐలు, 54 మంది ఎస్‌ఐలు, 150 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 800 మంది కానిస్టేబుళ్లతో పాటు ఏఆర్ పోలీసులు పనిచేస్తారని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఏ చిన్న అవరోధం కల్గించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన ప్రచార పర్వం

నియోజకవర్గంలో పరిధిలో పంచాయతీ ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు పోటాపోటీగా ర్యాలీలు, రోడ్డుషోలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభ్యర్థులు ఓట్లు అభ్యర్థించారు. అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామాల్లో చేసే అభివృద్ధి పనులపై కొందరు హామీ పత్రాలను సైతం ప్రదర్శించారు.



చేవెళ్లలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

ఎన్నికలను పక్కాగా నిర్వహించాలి

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండలంలోని బీఎస్‌ఐటీ కళాశాలలో ఎన్నికల అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో పొరపాట్లకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో ఎంపీడీవో సంధ్యారాణి అధ్యక్షతన సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు.

వీల్‌చైర్ బాస్కెట్ బాల్ పోటీల్లో సురేశ్ ప్రతిభ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ వీల్‌చైర్ బాస్కెట్ బాల్ 8వ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జిల్లాకు చెందిన దరావత్ సురేశ్ నిలిచారు. ఏఎంటీజెడ్ - డబ్ల్యూబీఎఫ్ఐ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలతతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గత నవంబర్ 25న బ్యాంకాక్‌లో జరిగిన వీల్‌చైర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ఈ మెడల్‌ను సాధించినట్లు తెలిపారు.



కలెక్టర్ నారాయణరెడ్డితో సురేశ్, డీఆర్డీవో శ్రీలత

తేలిన పంచాయతీ లెక్క

మూడు విడతల్లో ముగిసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

- జిల్లాలో 29 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం
- 627 వార్డు సభ్యులు యునానిమస్



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు, ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. మొత్తం మూడు విడతల్లో నామినేషన్లు స్వీకరించగా జిల్లా వ్యాప్తంగా 526 పంచాయతీలకుగాను 29 ఏకగ్రీవం కాగా, 4,668 వార్డులకుగాను 627 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. జిల్లాలో మంగళవారం తుది విడత నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మొత్తం 174 పంచాయతీలకుగాను పది పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే 1,598 వార్డులకుగాను 146 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

మూడో విడతలో పది ఏకగ్రీవం

మాడ్గుల మండలం కొర్రతండా సర్పంచ్‌గా కొర్ర జబ్బర్‌లాల్ నాయక్, పల్లెతండా సర్పంచ్‌గా విస్లావత్ సరిత, సంద్రలగడ్డ తండా సర్పంచ్‌గా సబావత్ జైపాల్ నాయక్ ఏకగ్రీవమయ్యారు. అలాగే మంచాల మండలం కొర్రవాని తండా సర్పంచ్‌గా అంబోత్ చంటి నాయక్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లిపూర్ సర్పంచ్‌గా కోట ప్రభాకర్‌రెడ్డి ఏకగ్రీవమయ్యారు. కందకూరు మండలం దావత్‌గూడ సర్పంచ్‌గా హన్మంత్‌నాయక్, దాసర్లపల్లి తండా సర్పంచ్‌గా వి.బుజ్జిలక్ష్మణ్‌నాయక్, సార్లరావులపల్లి సర్పంచ్‌గా వి.శ్రీనివాస్‌నాయక్‌లు ఏకగ్రీవమయ్యారు. అలాగే మహేశ్వరం మండలం ఉప్పుగడ్డతండా సర్పంచ్‌గా రాజునాయక్, దిలావర్‌గూడ సర్పంచ్‌గా సబావత్ మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తుది విడతలో ఏకగ్రీవాలు ఇలా..

మండలం	పంచాయతీలు	ఏకగ్రీవం	వార్డులు	ఏకగ్రీవం
కందుకూరు	35	3	312	34
మహేశ్వరం	30	2	258	12
ఇబ్రహీంపట్నం	14	-	144	4
మంచాల	23	1	216	8
యాచారం	24	-	232	12
అబ్దుల్లాపూర్‌మెట్	14	1	134	8
మాడ్గుల	34	3	302	68
మొత్తం	174	10	1598	146

ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ అధికారులు తెలంగాణ ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందేలా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం సందర్భంగా ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మలి విడత తెలంగాణ ఉద్యమంలో వివిధ వర్గాల ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుకూడా మమేకయ్యారంటూ ఆయన గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళికి లోబడి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమరవీరుల కుటుంబాలైన నీల దినేష్‌చంద్ర, ఎన్నెల్ల శేఖర్‌రెడ్డి, కాకి కుమార్ కుటుంబ సభ్యులతోపాటు కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

దివ్యాంగులను ఆదరించాలి

డీఆర్‌డీఏ డీపీఎం లీలాకుమారి

యాచారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, ప్రభుత్వం వారిని అన్ని విధాల ఆదుకుంటుందని డీఆర్‌డీఏ డీపీఎం లీలాకుమారి అన్నారు. శారీరకంగా దివ్యాంగులైనప్పటికీ వారిలో మంచి మనస్సు ఉంటుందని, ఎలాంటి కల్మషం లేకుండా నడుచుకుంటారని పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం యాచారం మండల కేంద్రంలో దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను మానవత్వంతో ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు టి.అయ్యప్ప, ఎంపీడీవో రాధారాణి, ఏపీఎం రవీందర్, సీసీలు గణేష్, బాలరాజు, నరేందర్, శేఖర్, వెంకటేష్, మండల మహిళాసమాఖ్య కార్యదర్శి సురక్షిత తదితరులున్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఆర్‌డీఏ డీపీఎం లీలాకుమారి

ఎన్నికలకు పటిష్ఠ భద్రత

సీఐలు జానకీరామ్ రెడ్డి, గంగాధర్

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో పంచాయతీ ఎన్నికల నిర్వాహణ కు పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిందని ఆమనగల్లు, కడ్తాల సీఐలు జానకీరామ్ రెడ్డి, గంగాధర్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, పోలెపల్లి, సింగంపల్లి, చెన్నంపల్లి, కడ్తాల మండలం చల్లంపల్లి, వంపుగూడ, సాలార్‌పూర్ గ్రామాల్లో ఆర్మ్‌డ్ రిజర్వు, స్థానిక పోలీసులతో కవాతు నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. ఈ నెల 14న జరిగే పోలింగ్ నేథప్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైన చట్ట విరుద్ధంగా వ్యహరించినా, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కవాతులో ఎస్‌ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, శేఖర్, వరప్రసాద్, చంద్రశేఖర్, సీతారామ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గన్నారు.



సాలార్‌పూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఎయిర్‌పోర్టులో తప్పిపోయిన బాలుడు

● గంట వ్యవధిలోనే ఆచూకీ కనుగొన్న పోలీసులు



ముస్తఫాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ సంపతి కనకయ్య

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం నాలుగేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ సంపతి కనకయ్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎండీ సల్మాన్ కుటుంబ సభ్యులతో కలిసి రియాద్ నుంచి వస్తున్న బంధువులను రిసీవ్ చేసుకునేందుకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అరైవల్‌లో వేచి ఉండగా సల్మాన్ కుమారుడు ముస్తఫా(4) కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి గంట వ్యవధిలోనే బాలుడిని కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హమీదుల్లానగర్‌కు చెందిన అన్నారం యాదయ్య ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. యాదయ్య చికిత్స నిమిత్తం ఈ నెల 6న శంషాబాద్ ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్నానని చెప్పి ఆటోలో వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో యాదయ్య సోదరుడు రాజు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రెండో రోజూ అదే సందడి

(ఐదో పేజీ తరువాయి)

చెందాలంటే మైదానాలు కీలకం. ఈ నేపథ్యంలో నగరానికి చేరువలో అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని క్రీడాకారులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, తదితర క్రీడల కోసం అత్యాధునిక మైదానాలు ఏర్పాటు చేసేందుకు సర్కారు అడుగులు వేస్తోంది. అలాగే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, వినోదాన్ని అందించేందుకు గానూ ఈ ప్రాంతంలో ఫిల్మ్ సిటీతో పాటు సరదాగా గడిపేందుకు రిసార్ట్‌లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. సమ్మిట్‌కు హాజరైన బాలీవుడ్, టాలీవుడ్ నిర్మాతలు, సినీ ప్రముఖులతో జరిగిన చర్చలో టూరిజంపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

ఆసక్తిగా స్టాళ్ల పరిశీలన

రెండో రోజుకూడా గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాలు ఆర్భాటంగా కొనసాగాయి. మంగళవారం కూడా వివిధ దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 10.20 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా సమ్మిట్‌కు చేరుకున్నా రు. అనంతరం అతిథులు, పారిశ్రామికవేత్తలతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశమయ్యా రు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడ ఏర్పాటు చేసిన 40 స్టాళ్లను పరిశీలించారు. ఇందులో విద్య, వైద్యం, వ్యవసాయం, ఫ్యూచర్ సిటీ కమిషనర్ పరిధిలో ఏర్పాటు చేయనున్న చిత్రాలు అతిథులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన ఓ కళాశాల విద్యార్థులు కేవలం రూ.18 వేలతో వ్యయంతో తయారు చేసిన గ్రాస్ కటింగ్ మిషన్‌ను భట్టి ఆసక్తిగా పరిశీలించారు. ఆ మెషీన్‌ను సచివాలయంలో తన చాంబర్ ఎదుట పర్మినెంట్‌గా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడం విశేషం.



ఈవీ వాహనంపై సినీ నటి అమల విహారం



డిజిటల్ స్క్రీన్‌ను తిలకిస్తున్న కార్మికులు

ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా జాగ్రత్తలు

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తుక్కుగూడ మీదుగా గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలతో పాటు ప్రముఖుల వాహనాలకు ట్రాఫిక్ అడ్డంకులు తలెత్తకుండా పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తుక్కుగూడ ఔటర్ రింగురోడ్డు నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ఆరు ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు.



వెలుగు జిలుగులతో ఆకట్టుకున్న డ్రోన్ల సమూహం

ప్రముఖుల సందడి

సమావేశాల చివరి రోజు ప్రముఖుల సందడి నెలకొంది. సినీ నటుడు చిరంజీవి, బాలీవుడ్ నటుడు అర్జున్‌కపూర్, నటి జెలినీయా, నిర్మాతలు శ్యాంప్రకాశ్, అల్లు అరవింద్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.



ప్రవేశద్వారం వద్ద అతిథులు



సమావేశాల్లో పాల్గొన్న అతిథులు, అధికారులు



ఎయిర్‌పోర్టులో పారిశ్రామికవేత్తల సందడి

● 20 ప్రత్యేక విమానాల్లో గ్లోబల్ సమ్మిట్‌కు..

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రెండు రోజులుగా పారిశ్రామిక వేత్తలు తరలివస్తున్నారు. దాదాపు 20 ప్రత్యేక విమానాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యారు. పెద్దపెద్ద కంపెనీలకు చెందిన డెలిగేట్స్ ప్రత్యేక విమానాల్లో రావడంతో ఎయిర్‌పోర్టులో సందడి నెలకొంది. వీరితో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన డెలిగేట్స్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనాల్లో గ్లోబల్ సమ్మిట్‌కు వెళ్లారు. నేటితో ముగియనున్న గ్లోబల్ సమ్మిట్ అయితే సామాన్య ప్రజలకు మరో రెండు రోజులు సందర్శన ఉంటోందని అధికారులు తెలిపారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రమివేత్తలు, బిల్‌గేట్స్ ప్రముఖులు రానున్న నేపథ్యంలో శంషాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పారిశ్రామికవేత్తలను ఎయిర్‌పోర్టులో పోలీసులు రిసీవ్ చేసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి గ్లోబల్ సమ్మిట్ వరకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.



ఎయిర్‌పోర్టులో డెలిగేట్స్‌ను రిసీవ్ చేసుకుంటున్న సీఐ సంపతి కనకయ్య, ఎస్సై శ్రీనివాస్

మున్నూరు కాపు సంఘం ఎన్నికల్లో పాల్గొనాలి



శామీర్‌పేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుశోత్తంరావు అన్నారు. మంగళవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పురుశోత్తంరావు విచ్చేసి మాట్లాడారు. ఈ నెల 12న ఉదయం 9 గంటలకు శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని శుభం గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు.

సోనియాగాంధీని తెలంగాణ మరువదు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/కడ్తాల్/మహేశ్వరం/కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ, స్వరాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని తెలంగాణ ప్రజలు ఎప్పటికి మరువబోరని షాద్‌నగర్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఆవరణలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి జరుపుకున్నారు. స్వరాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీకే దక్కిందని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం సోనియా జన్మదిన వేడుకలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కడ్తాలలో సోనియా జన్మదిన వేడుకల్లో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు పాల్గొన్నారు. కందుకూరు మహేశ్వరం మండలాల్లో మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నామని సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చాకలిగూడకు చెందిన అలీమ్ మంగళవారం కనకమామిడి నుంచి వెంకటాపూర్ వైపు ఆటోలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు.

ఏరులై పారుతున్న మద్యం



వికారాబాద్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): నేటితో తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియనుంది. అలాగే సాయంత్రం ఐదు గంటల తర్వాత మద్యం దుకాణాలు సైతం మూతపడనున్నాయి. ఈ నేపథ్యంలో పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. ఓటర్లకు సరఫరా చేసేందుకు పెద్ద మొత్తంలో వైన్స్‌ల నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు. సుమారు ఒక్కో గ్రామానికి రూ.లక్ష నుంచి 20 లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తొలి విడత ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో ఏ మద్యం దుకాణం చూసినా కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. ఈ స్థాయిలో మద్యం అక్రమంగా తరలిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు ఇంకా అమ్మితే బాగుంటుంది ప్రభుత్వానికి లెక్కలుగా చూపించొచ్చు అన్నట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. కట్టడి చేయాల్సిన వారే తమకేం సంబంధం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన పోలీస్, ఆర్టీఏ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పక్క నియోజకవర్గాలకు స్కూల్ బస్సులు

ఎన్నికల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సుల మీద దృష్టి సారించారు. రెండు రోజుల పాటు ఎన్నికల పనుల్లో బస్సులను వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ ఈసారి పక్క నియోజకవర్గంలోని పంచాయతీ ఎన్నికల కోసం కూడా వికారాబాద్ నియోజకవర్గంలోని బస్సులనే అడగడం వల్ల ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా చేస్తే రెండు రోజులు పిల్లలకు సెలవు ఇవ్వాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు పంపకపోతే అధికారులు ప్రవర్తన భయపెట్టే విధంగా ఉందని, తమ బస్సులు కాకుండా ఎన్నో ప్రైవేటు వాహనాలు ఉంటాయని వాటిని ఉపయోగించుకుంటే వారికి కూడా ఉపాధి ఇచ్చిన వారు అవుతారని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

అమ్మా బాగున్నావా.. తమ్ముడూ ఏం చేస్తున్నావ్

- ఊరూరా ఎన్నికల హడావుడి
- ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతున్న అభ్యర్థులు





దౌల్తాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఊరూరా ఎన్నికల హడావుడి నెలకొంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఈ నెల 11న ఉండడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం ముగిసినా ఉదయం నుంచి రాత్రి వరకూ ఓటర్లను కలుస్తూ గెలిపించాలని వేడుకుంటున్నారు. సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా పోటీలో నిలిచిన వారు చలిలో సైతం ఇంటింటికీ తిరుగుతున్నారు. కోడి కూయకముందే ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతున్నారు. 'అమ్మా బాగున్నావా, తమ్ముడు ఏం చేస్తున్నావ్' అంటూ పలకరిస్తున్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో ఎలాగైనా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. కలిసి వారినే మళ్లీ మళ్లీ కలుస్తూ ఓట్లు అడుగుతున్నారు. గతంలో లాగా గోడలపై రాతలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు లేకపోవడంతో ఓటర్లను ఎలాగైనా ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఇది చేస్తాం.. అది చేస్తామని హామీలు ఇవ్వడమే కాకుండా డబ్బు, మద్యంతో ఎరవేస్తున్నారు. కొందరైతే పొలాల వద్దకు వెళ్లి మరీ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ముగిసిన పంచాయతీ ప్రచారం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరు పాటించాలని ఎంపీడీవో మున్నీ తెలిపారు. సాయంత్రం ఐదు గంటల తరువాత ప్రచారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. ఇప్పటికే 190 పోలింగ్ బూత్‌లకు బ్యాలెట్ బాక్సులను పంపించామని ఆమె తెలిపారు. ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రతలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆర్వోలు, పోలింగ్ ఆఫీసర్లు, రిజర్వుడ్ సిబ్బంది మొత్తం 493 మంది ఎన్నికల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 11న సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమై, మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్ ముగుస్తోంది. 2గంటల తరువాత ఓట్లు లెక్కింపు ఉంటాయని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.


పోలింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లపై తెలుసుకుంటున్న ఎంపీడీవో

11 మంది ఉద్యోగులు
పోస్టల్ బ్యాలెట్ వినియోగం


తాండూరు మండల పరిషత్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగులు

తాండూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో వెళ్లే ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లోకి వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులు 117 మంది రెండు రోజులుగా పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ మంగళవారం తెలిపారు.

మండల పరిషత్‌లోనే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

చేవెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించేందుకు ఈ నెల 11, 12వ తేదీల్లో అవకాశం కల్పిస్తున్నట్లు చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్‌లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈ నెల 13న ఆయా పంచాయతీల పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. వాటిని 14న ఎన్నికల అనంతరం ఓట్లను లెక్కించడం జరుగుతుందని ఎంపీడీవో వివరించారు.

ఉద్యోగుల్లో గుబులు రేపుతున్న
పోస్టల్ బ్యాలెట్



కొడంగల్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు గుబులు పడుతున్నారు. గ్రామాల్లో నిర్ణీత సంఖ్యలోనే ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వారిలో ముగ్గురు, నలుగురికి ఎన్నికల విధులుంటే వారు సొంతూళ్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అభ్యర్థి గుర్తుపై వారు సంతకం చేస్తారు. సాధారణ ఓటరులా వారు స్వస్తిక్ సింబల్ వేసే వెసులుబాటు లేదు. బ్యాలెట్ పేపర్‌పై పెన్నుతో టిక్ చేసి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లో వేస్తారు. లెక్కింపు సమయంలో ఏజెంట్ల ముందే లెక్కిస్తారు కాబట్టి సదరు ఉద్యోగి ఎవరికి ఓటు వేశారనేది తెలుస్తుంది. దీంతో రహస్య ఓటింగ్ లేకుండా పోతుంది. ఓటు పడని అభ్యర్థి తనకు వీరు ఓటు వేయలేదని గుర్తిస్తే మనస్పర్థలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వెనకడుగు వేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ స్వస్తిక్ గుర్తునే వాడాలి



పోస్టల్ బ్యాలెట్‌లో పెన్‌తో టిక్ కాకుండా స్వస్తిక్ గుర్తుతో ఓటు వేయించి లెక్కింపు సమయంలో సాధారణ బ్యాలెట్లలో కలిపితే బాగుటుంది. ఇలా చేస్తే ఉద్యోగి ఎవరికి ఓటేశారో తెలియదు. అందుకోసం కలెక్టర్‌కు, ఎన్నికల సంఘం అధికారులకు టీఎస్‌యూటీఎఫ్ తరఫున వినతిపత్రాలిచ్చాం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గోప్యతను కాపాడాల్సి ఉంది.

- ఎఫ్.నర్సిములు టీఎస్‌యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి

ఎన్నికల నిబంధనలు పాటించాలి

చౌదరిగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల ఆదేశాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన వారికి తమ ఓటును వేసుకోవాలని సూచించారు. 11న పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు సహకరించాలని కోరారు.

మినహాయింపు ఇవ్వాలి

బొంరాస్‌పేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల స్టేజ్-2 విధుల్లో ఉన్న అంగవైకల్యం, పాలిచ్చే తల్లులు, గర్భిణి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యుటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌరారం గోపాల్, ఎండీ.అలీముద్దీన్ కోరారు. మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో వెంకన్నగౌడ్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. నరేందర్‌గౌడ్, మల్లేశ్, శివరాజ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవాల జోరు

ఎన్నిక పత్రాలు అందుకున్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు


కందుకూరు: దాసర్లపల్లి తండా సర్పంచ్‌గా ఎన్నికైన బుజ్జిలక్ష్మణ్‌నాయక్, వార్డు సభ్యులు

కందుకూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలంలో 35సర్పంచ్‌లకు మూడు సర్పంచ్ పదవులు ఏకగ్రీవమైనట్టు ఎంపీడీవో సరిత మంగళవారం తెలిపారు. దావుత్‌గూడ సర్పంచ్‌గా హనుమంత్ నాయక్ ఎంపికయ్యారు. ఇక్కడ వార్డుపదవులకు ఎన్నికలు జరగనున్నాయి. దాసర్లపల్లితండా సర్పంచ్‌గా వి.బుజ్జిలక్ష్మణ్‌నాయక్, ఆరు వార్డులు ఏకగ్రీవమైనట్టు ఎంపీడీవో తెలిపారు. సార్లరావులపల్లి సర్పంచ్‌గా వి.శ్రీనివాస్‌నాయక్ ఏకగ్రీవమయ్యాడు. వార్డు పదవులకు ఎన్నికలుంటాయి. అలాగే మండలంలో మరో 32 పంచాయతీల్లో 30వార్డు పదవులు ఏకగ్రీమయ్యాయని ఎంపీడీవో తెలిపారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవ సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్‌ను మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏకగ్రీవ సర్పంచ్‌లంతా కాంగ్రెస్ మద్దతుదారులేనని జంగారెడ్డి తెలిపారు.

మహేశ్వరంలో...

మహేశ్వరం: మండలంలోని 30 పంచాయతీలకు ఉప్పుగడ్డతం డా, దిలావర్‌గూడ సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయని ఎంపీడీవో శైలజారెడ్డి తెలిపారు. ఉప్పుగడ్డతండా సర్పంచ్ రాజునాయక్, ఉప సర్పంచ్, ఆరుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. దిలావర్‌గూడలో సర్పంచ్ మంజుల ఏకగ్రీవం కాగా ఆరు వార్డులకు ఈ నెల 17న ఎన్నికలు నిర్వహించనున్నారు.

దోమ మండలంలో ఐదు పంచాయతీలు..

దోమ: సర్పంచ్, వార్డు పదవులకు నామినేషన్ల ఉపసంహరణ మంగళవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 36 పంచాయతీలు, 308 వార్డుల్లో ఐదు గ్రామాల సర్పంచ్, వార్డు పదవులు ఏకగ్రీవమయ్యాయి. కిష్టాపూర్ సర్పంచ్‌గా వరలక్ష్మి, గొట్లచెల్కతండా-కవిత, లింగన్‌పల్లి-గోపాల్, దోర్నాలపల్లి-సత్యనారాయణరెడ్డి, బ్రాహ్మణపల్లిపెద్ద తండా-సురేఖ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఏకగ్రీవమైన వారికి ఆర్వోలు నియామక పత్రాలు అందజేశారు. మరో 31 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి.


మాడ్గుల మండలంలో ఏకగ్రీవమైన పంచాయతీ సభ్యులు

12 వార్డులు ఏకగ్రీవం

యాచారం: తమ్మలోనిగూడ పంచాయతీలో ఐదు వార్డు పదవులు ఏకగ్రీవమయ్యాయని అధికారులు వెల్లడించారు. మండలంలోని 24 పంచాయతీలకు 83 మంది అభ్యర్థులు.. 220 వార్డు పదవులకు 667మంది పోటీలో ఉన్నారని అధికారులు తెలిపారు. మండల ఎన్నికల పరిశీలకులుగా కల్పనను కలెక్టర్ నియమించారు.

మక్తగూడలో ఏడు వార్డులు ఏకగ్రీవం

కొత్తూర్: మండలంలోని మక్తగూడ పంచాయతీలో ఏడు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఇక్కడ సర్పంచ్, ఒక వార్డుకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవికి శ్రీరాములు, వడ్డె శేఖర్ పోటీలో ఉన్నారు.

బరిలో 37 మంది సర్పంచ్ అభ్యర్థులు

ఆదిబట్ల: పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు ఖరారయ్యాయి. మంగళవారం విత్‌డ్రాల గడువు ముగిసింది. 14 పంచాయతీల్లో 37 మంది అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉన్నారు. 144 వార్డులకు 354 మంది పోటీ పడుతున్నారు. నాలుగు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం నుంచి గ్రామాల్లో గుర్తులతో అభ్యర్థులు ప్రచారం చేయనున్నారు.

సర్పంచ్ పదవులకు 84 మంది పోటీ

మంచాల: మండలంలోని 22పంచాయతీ సర్పంచ్ పదవులకు 84మంది బరిలో ఉన్నారు. మొత్తం 23పంచాయతీలు, 216 వార్డులుండగా కొర్రవానితండా పంచాయతీ ఏకగ్రీవమైంది. కాగజ్‌ఘట్‌లో రెండు వార్డులు, బోడకొండలో ఒక వార్డు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 205 వార్డులకు 622 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మూడు తండాలు ఏకగ్రీవం

మాడ్గుల:మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో మూడు తండాలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి(ఎంపీడీవో) విజయలక్ష్మి తెలిపారు. కొర్ర తండా సర్పంచ్ కొర్ర జబర్‌లాల్, ఉప సర్పంచ్ కొర్ర బాలునాయక్, 8 వార్డులు ఏకగ్రీవం అయినట్టు ఎంపీడీవో తెలిపారు. అలాగే సంద్రలగడ్డ తండా సర్పంచ్‌గా సబావత్ జైపాల్, ఉపసర్పంచ్ ఇస్లావత్ నీల, 8వార్డు సభ్యులు, అలాగే పల్లెతండా సర్పంచ్‌గా ఇస్లావత్ సరిత, ఉపర్పంచ్ సేవ, 8 వార్డు సభ్యులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి విజయలక్ష్మి తెలిపారు. కాగా మండలంలోని 34 పంచాయతీల్లో మొత్తం 59 వార్డు పదవులు ఏకగ్రీవం అయినట్లు అధికారి తెలిపారు. ఏకగ్రీవమైన వారిని ప్రజలు ఘనంగా సన్మానించారు.

నా ప్రమేయం లేకుండానే నామినేషన్ విత్‌డ్రా చేశారు

- కలెక్టర్‌కు సర్పంచ్ అభ్యర్థి ఫిర్యాదు


మాట్లాడుతున్న రాజు

పెద్దేముల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'నా ప్రమేయం లేకుండానే నానామినేషన్ విత్‌డ్రా చేశారు. దానిపై చర్యలు తీసుకోండి.' అని ఆత్కూర్ సర్పంచ్ అభ్యర్థి బ్యాగరి రాజు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే పెద్దేముల్ మండలం ఆత్కూర్ పంచాయతీకి ఈ నెల 11న జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా ఏడుగురు నామినేషన్ వేశారు. అయితే గ్రామస్థులు పంచాయతీకి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేయాలని భావించారు. సర్పంచ్ పదవికి నామినేషన్లు వేసిన ఆరుగురు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఆత్కూర్ పంచాయతీ ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు. అయితే మంగళవారం ఓ అభ్యర్థి బ్యాగరి రాజు వచ్చి తాను నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకోలేదని, తనకు తెలియకుండానే తన అన్న ద్వారా నామినేషన్ విత్‌డ్రా చేయించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆత్కూర్‌లో ఈ విషయం చర్చనీయాంశమైంది. కలెక్టరేట్‌లో ఈ విషయం ఆయన మీడియాతో మాట్లాడడంతో విషయం బయటపడింది. రాజును సంప్రదించేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న కుసుమ మాధురి

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అలసత్వం వహించొద్దని జిల్లా సహాయ ఎన్నికల అధికారి కుసుమ మాధురి అన్నారు. ఈ నెల 14న పంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లులోని జెడ్పీ బాలుర పాఠశాలలో మంగళవారం పంచాయతీ ఎన్నికల పీవోలు, ఓపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 125మంది పీవోలు శిక్షణకు హాజరయ్యారు. బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ నిర్వహణ, కౌం టింగ్‌లపై మాధురి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో పాండు, సిబ్బంది కుమార్, ప్రసన్న, ఝాన్సీ, శ్రీకాంత్, రమేశ్, స్టేజ్-2 రిటర్నింగ్ ఆఫీసర్లు శ్రీధర్, అనంతరెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

పరిగి: పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత పీవోలపై ఉందని వికారాబాద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వాసుచంద్ర అన్నారు. పరిగి శివారులోని రంగాపూర్ రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి, నిర్వహణలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు నుంచి పోలింగ్, ఫలితాలు ప్రకటించే వరకు బాధ్యతగా పనిచేయాలని, ఎవరికీ అనుకూలంగా, ప్రతీకూలంగా పనిచేయొద్దని సూచించారు.

ఉప సర్పంచ్ పదవికి పోటీ తీవ్రం



కొడంగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఉప సర్పంచ్ పదవికి తీవ్ర పోటీ ఏర్పడింది. రిజర్వేషన్ ఏదైనా సర్పంచ్‌తో పాటు జాయింట్ చెక్ పవర్ ఉండటమే ఇందుకు కారణం. రిజర్వేషన్లు కలిసిరాని చోట వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్ కావాలని కొందరు పోటీ పడుతున్నారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేసేందుకైనా వెనుకాడటం లేదు. గెలుస్తామన్న నమ్మకం ఉన్న కొందరు ఇతర వార్డు సభ్యుల మద్దతు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలో అభ్యర్థులు ఓట్లు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు.

తీగాపూర్‌లో బీఆర్ఎస్‌లో కుమ్ములాటలు

- పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

కొత్తూర్, డిసంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి తీగాపూర్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకుని, దూషించుకున్న సంఘటనలపై ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. తీగాపూర్ సర్పంచ్ పదవికి బీఆర్ఎస్ తరఫున బీరంగూడ జయప్రదజగన్మోహన్‌రెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బలపర్చిన ఇద్దరు అభ్యర్థులు ప్రధానంగా పోటీలో ఉన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తీగాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి కృష్ణయ్య తన అనుచరులు కూడా హాజరై జయప్రదకు మద్దతు తెలిపారు. ఇదిలా ఉంటే మంగళవారం కృష్ణయ్య పాతిమాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి ఓటువేయాలని చెబుతున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని కృష్ణయ్యను నిలదీశారు. ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. తాను కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేయలేదని, అకారణంగా జగన్మోహన్‌రెడ్డి, అతడి అనుచరులు తనపై దాడి చేశారని కృష్ణయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉండి మరో పార్టీ అభ్యర్థికి ప్రచారం ఎలా చేస్తారని అడిగిన తనను కృష్ణయ్య, అతడి అనుచరులు కులం పేరుతో దూషించి దాడి చేశారని బీఆర్ఎస్ నాయకుడు పబ్బె రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు వర్గాల ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి నలుగురి సస్పెండ్

యాచారం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన నలుగురిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.రమేష్‌గౌడ్ మంగళవారం తెలిపారు. పార్టీ ఆదేశం మేరకు సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ ఉపసంహరించుకోకపోవడం, పార్టీ ఆదేశాలను పట్టించుకోనందున ఎం.స్వరూప, ఎం.శ్రీనివాస్, ఎ.గణేష్, వి.కిషన్‌లను అనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు.

మైల్వార్‌లో కిడ్నాప్ కలకలం

- కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి భర్త వాహనం అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు
- అర్ధరాత్రి వాహనంలో తరలింపు
- ఓ ఇంట్లో బంధించారని బాధితుడు ఖాలీద్ ఆరోపణ


తన కిడ్నాప్‌పై విలేకరుల సమావేశంలో వివరిస్తున్న ఖాలీద్

బషీరాబాద్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):మైల్వార్ గ్రామం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సీమాసుల్తానా భర్త, మాజీ వైస్ఎంపీపీ ఖాలీద్ కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. సోమవారం అర్ధరాత్రి తర్వాత కర్ణాటక రాష్ట్రం అడికి గేటు వద్ద బీఆర్ఎస్ నాయకులు కొందరు ఖాలీద్ వాహనాన్ని అడ్డగించి కిడ్నాప్ చేసి వాహనంలో తరలించడంపై రాత్రంతా హైడ్రామా కొనసాగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాల ప్రకారం.. ఖాలీద్, తాండూరు పట్టణానికి చెందిన రఘునందన్‌కు రూ.20లక్షల చెల్లింపు విషయంలో గొడవలున్నాయి. తీసుకున్న డబ్బులు చెల్లించాలని రఘునందన్ పలుమార్లు అడుగగా, ఖాలీద్ రూ.7లక్షల మేర తిరిగి చెల్లించాడు. మిగతా డబ్బు ఖాలీద్ చెల్లించలేదు. దీంతో రఘునందన్ మైల్వార్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు అమ్జాద్, దానం రాములుతో కలిసి వాహనంలో తనను కిడ్నాప్ చేశారని ఖాలీద్ ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల్లో తన భార్య సీమాసుల్తాన గెలుపు ఖాయమని తెలుసుకుని, తనకు అప్పు ఇచ్చిన వ్యక్తితో కలిసి బీఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ ప్లాన్ చేశారన్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పోలీసులను అప్రమత్తం చేయడంతో ప్రాణగండం తప్పిందని ఖాలీద్ విలేకరుల సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు.

ఖాలీద్ కిడ్నాప్ జరిగిందిలా..

ఖాలీద్ కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా నుంచి తాండూరు పట్టణానికి చెందిన అడ్వకేట్ విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు బలారం, అసిఫ్, సైబస్‌లు రాత్రి 11.30గంటల సమయంలో వాహనంలో మైల్వార్‌కు బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం అడికి గేటు వద్దకు చేరుకోగా అక్కడ మాటు వేసిన రఘునందన్, అమ్జాద్, రాములు, విక్కీ, నరేష్ ఖాలీద్ వాహనాన్ని రాళ్లతో కొట్టి అడ్డుకున్నారు. రఘునందన్, అమ్జాద్, రాములు తదితరులు ఖాలీద్ వాహనంలోని వారందరినీ బయటకు లాగేశారు. ఖాలీద్‌ను కిడ్నాప్ చేసి టోల్‌గేటు వద్ద మరో వాహనంలోకి ఎక్కించుకున్నారు. తాండూరు పట్టణం సాయిపూర్‌నకు తరలించి ఓ ఇంట్లో బంధించారని ఖాలీద్ ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఖాలీద్ సోదరుడు ఖాలీల్, స్థానిక నాయకులతో కలిసి ఘటన వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ నేత అమ్జాద్‌ను పట్టుకుని ఖాలీద్‌ను కిడ్నాప్ చేసి ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పాలని ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఖాలీద్ ఆచూకీ చెప్పాలని అమ్జాద్‌ను రాత్రంతా వాహనంలో తిప్పి గుర్మిట్‌కల్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఖాలీద్ కిడ్నాప్ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఖాలీద్‌ను వదిలేయాలని మందలించడంతో కిడ్నాప్ చేర నుంచి బయటపడ్డానని ఖాలీద్ వివరించాడు. ఈ విషయమై తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌రెడ్డి మంగళవారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపారు. ఇరు వర్గాల ఫిర్యాదులతో కేసులు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేస్తామన్నారు.

మోసం.. కాంగ్రెస్ నైజం

- విద్యావంతుడు ఆనంద్‌ను గెలిపించాలి
- బీఆర్ఎస్ నాయకులు.. కడ్తాలలో భారీ ర్యాలీ
- సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్‌కు మద్దతుగా సమావేశం.. పెద్దఎత్తున హాజరైన ప్రజలు


ఆనంద్‌కు మద్దతుగా ర్యాలీలో నాయకులు తదితరులు

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మోసం కాంగ్రెస్ నైజమని, అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి రెండేళ్లైనా సాధించిందేమీ లేదని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మలా శ్రీశైలంగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణలు ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్‌కు మద్దతుగా మంగళవారం కడ్తాలలో నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఆనంద్‌లకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఉంగరం గుర్తు బ్యానర్లు, కటౌట్లు చేబూని ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ చేపట్టారు. ఎంటీపీ గార్డెన్‌లో సమవేశం నిర్వహించారు. ర్యాలీ, సభ విజయవంతం బీఆర్ఎస్ శ్రేణులు, ఆనంద్ మద్దతుదారుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఆనంద్ విజయానికి కదిలివచ్చిన జనమే నిదర్శనమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, దశరథ్‌నాయక్, జీఎల్ఎన్ రెడ్డి, గంప వెంకటేశ్, నిర్మలశ్రీశైలం గౌడ్‌లు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు పంచాయతీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సర్పంచ్‌గా ఆనంద్‌ను గెలిపిస్తే నిరుపేదలందరికీ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇళ్ల నిర్మాణానికి తోడ్పాటునందిస్తానని చెప్పారు. తనను ఆదరించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిగా పనిచేస్తానని, 14న పోలింగ్ అనంతరం తాను గెలుపొందగానే 15వ తేదీన రూ.22 లక్షల వ్యయంతో కడ్తాలకు సొంత నిధులతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయిస్తానని ఆనంద్ తెలిపారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ మాట్లాడుతూ విద్యావంతుడైన ఆనంద్‌ను కడ్తాల సర్పంచ్‌గా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆనంద్‌కు పాలనానుభవంతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉందన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణలు అన్నారు. గంప శ్రీనివాస్, లాయక్ అలీ, మంగళపల్లి నర్సింహ్మా, అంజి, మహేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, రాంచంద్రయ్య, భగీరథ్, రవినాయక్, దాసు, గణేశ్, సురేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఉప్పల వెంకటేశ్, దశరథ్‌నాయక్, జీఎల్ఎన్ రెడ్డి, గంప వెంకటేశ్‌తో కలిసి మాట్లాడుతున్న ఆనంద్

గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

నర్ఖూడ సర్పంచ్ అభ్యర్థి గడ్డం శేఖర్‌యాదవ్


గ్రామస్తులతో కలిసి నర్ఖూడలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న గడ్డం శేఖర్‌యాదవ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంతన్న సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థి గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంతన్న, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు అండతో గ్రామాన్ని జిల్లాలో అదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని శేఖర్‌యాదవ్ చెప్పారు. ఉంగరం గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ఆ పార్టీ అభ్యర్థినే గెలిపించాలని ఆయన కోరారు. ఇప్పటికే ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మరిన్ని ఇళ్లు మంజూరు చేయిస్తామని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇవ్వని, ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం లక్షల మందికి ఇచ్చిందని చెప్పారు. నర్ఖూడ కోసం ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేశానని ఆయన చెప్పారు. ఆడబిడ్డ భరోసా కింద నర్ఖూడ గ్రామంలోని ప్రతీ ఆడబిడ్డ పెళ్లికి సొంత నిధులతో పుస్తె, మెట్టెలతో పాటు రూ25వేల ఆర్థికసాయం అందిస్తామని, జలజీవన ప్రగతి కింద నర్ఖూడ గ్రామంలో తాగునీటి సరఫరా గంట నుంచి రెండు గంటలకు పెంపు, గ్రామంలోని ఇంటి పెద్దకి రూ.5 లక్షల జీవిత బీమా, ఉచిత వైద్య శిబిరం, లీగల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, పల్లె పారిశుధ్యం, గ్రీవెన్స్ యాప్, డ్రైనేజీ సీసీ రోడ్ల నిర్మాణం, యువ క్రీడా శక్తి, సీసీ కెమెరాల నిర్వహణ, డబుల్ ఇంజన్ శక్తి, రైతన్నకు అండ, గ్రంథాలయం ఏర్పాటు వంటి గ్రామ మేనిఫెస్టోతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని శేఖర్‌యాదవ్ వివరించారు. యువకుడినైన తనకు అవకాశం ఇస్తే నిస్వార్థంగా సేవలు అందిస్తానని చెప్పారు. గతంలో కూడా ఉపసర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించానని, ఇప్పుడు మరోసారి సర్పంచ్‌గా అవకాశం వచ్చిందని, ఆశీర్వదించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తానని చెప్పారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. ఎంతో మంది నిరుపేదలకు సొంత డబ్బుతో గుళ్లకు విరాళం, పుస్తె, మెట్టెలు అందజేసినట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో జిల్లాలోనే నర్ఖూడ గ్రామాన్ని అదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. సర్పంచ్‌గా గెలిపిస్తే మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు తీసుకొస్తునాని చెప్పారు. మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు మాట్లాడుతూ యువకుడికి అవకాశం ఇస్తే గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్న సహకారంతో గ్రామానికి అత్యధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు.


ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న శేఖర్‌యాదవ్

గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

- ప్రొద్దటూరు సర్పంచ్ అభ్యర్థి బండ లక్ష్మీనర్సింహ


బండ లక్ష్మీనర్సింహ, సర్పంచ్ అభ్యర్థి


ప్రొద్దటూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి బండ లక్ష్మీ నర్సింహ

శంకర్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తమ కుటుంబం ప్రజా జీవితంలో ఉందని, సర్పంచ్‌గా అవకాశమిస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానని ప్రొద్దటూరు సర్పంచ్ అభ్యర్థి బండ లక్ష్మీనర్సింహ తెలిపారు. కత్తెర గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను వేడుకున్నారు. మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహిస్తూ.. తాను గెలిచిన అనంతరం పెద్దల సహకారంతో సమస్యలను వెంటనే పరిష్కరిస్తానన్నారు. తన అత్త బండ ముత్తమ్మ ఇదివరకే సర్పంచ్, ఎంపీటీసీగా గ్రామానికి సేవ చేశారని గుర్తుచేశారు. ఆమె హయాంలో గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందిందని వివరించారు. ముత్తమ్మ గ్రామానికి నిస్వార్థంగా సేవలందించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అర్హులందరికీ పథకాలు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సజావుగా పోస్టల్ పోలింగ్

కేశంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సజావుగా నిర్వహించారు. రెండు రోజులుగా 56 ఓట్లు పోలైనట్లు అధికారులు చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్నవారు ఓటింగ్ వినియోగించుకున్నారు.

మైసిగండి ప్రగతే లక్ష్యం

- మైసిగండి కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి జటావత్ ప్రేమ జవహర్‌లాల్‌నాయక్


ప్రచారంలో జటావత్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మైసిగండి గ్రామ ప్రగతే లక్ష్యమని, ఆదరించి సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవకురాలిగా పనిచేస్తానని మైసిగండి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి జటావత్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మైసిగండిని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతానన్నారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జటావత్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్ మంగళవారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ సిరోలిపంతూ, మాజీ సర్పంచ్ రామావత్ తులసీరామ్ నాయక్‌లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మైసిగండికి ప్రత్యేక నిధులు రాబట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తానని చెప్పారు. స్థానిక సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఎవరికి ఓటువేస్తే మేలు జరుగుతుందో, గ్రామం అభివృద్ధి చెందుతుందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. తులసీరామ్‌నాయక్, కిషన్ నాయక్, హీరాసింగ్, దూద్యనాయక్, అమ్మనాయక్, యమున చందన్, వినోద్, బన్సిలాల్ శారద, రాజు, భాస్కర్, అరుణ్, అనిల్, కృష్ణ రాజారామ్, తదితరులున్నారు.


ఎస్‌బీ పల్లిలో గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతా సత్యనారాయణ

ఎమ్మె యాదమ్మ గెలుపు ఖాయం

- మాజీ జడ్పీటీసీ శ్రీలతా సత్యనారాయణ

కొత్తూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి సర్పంచ్‌గా బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థి ఎమ్మె యాదమ్మ గెలుపు ఖాయమైందని కొత్తూర్ మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతా సత్యనారాయణ అన్నారు. మంగళవారం గ్రామంలో యాదమ్మ గ్రామస్తులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో శ్రీలతా సత్యనారాయణ పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మె యాదమ్మకు గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన ఎమ్మె సత్యనారాయణ గ్రామాభివృద్ధికి హితోధికంగా కృషి చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తుచేశారు. తాను జడ్పీటీసీగా పనిచేసిన సమయంలో గ్రామానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని, ఉంగరం గుర్తుకు ఓటేసి యాదమ్మను ఆశీర్వదిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. గ్రామస్తుల స్పందన చూస్తుంటే యాదమ్మ గెలుపు ఖాయమంగా కనిపిస్తుందని శ్రీలతా సత్యనారాయణ అన్నారు.


ఎమ్మె యాదమ్మకు మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


విజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మొగిలిగిద్ద గ్రామ సర్పంచ్‌గా తనను గెలిపిస్తే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా మారుస్తానని కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి అంబటి విజయ్ కుమార్(రాజు) తెలిపారు. పదేళ్లలో గ్రామం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదని, మొగిలిగిద్దకు ఎంతో చరిత్ర ఉందని, అభివృద్ధిలో మాత్రం వెనుకబడిందని తెలిపారు. మహిళలు, యువకుల నుంచి మంచి స్పందని వస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి తనను గెలిపిస్తే గ్రామం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతరులకు ఓటు వేస్తే గ్రామం అభివృద్ధిలో మరింత వెనుక బడిపోతుందని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా చేస్తానని, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. విజయ్ కుమార్‌కు మద్దతుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రచారం నిర్వహించారు. విజయ్ కుమార్‌ను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ప్రచారం చేశారు. గ్రామాభివృద్ధికి విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.


ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతా


గోపులారంలో ప్రచారం నిర్వహిస్తున్న తంగడిపల్లి రవిందర్‌రెడ్డి


తంగడిపల్లి రవిందర్‌రెడ్డి గోపులారం సర్పంచ్ అభ్యర్థి

శంకర్‌పల్లి, డిసెంబరు 9 బ(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులు తనను ఆదిరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అభివృద్ధి చేసి చూపుతానని గోపులారం సర్పంచ్ అభ్యర్థి తంగడిపల్లి రవిందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మాజీ సర్పంచ్ పొడువ శ్రీనివాస్, గ్రామపెద్దలతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫుట్‌బాల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. తనను ఆశీర్వదించి ఆదరిస్తే గ్రామస్తులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా అహర్నిశలు కృషి చేస్తానని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు వచ్చేలా ప్రయత్నిస్తానని, వచ్చే ఐదేళ్లలో గోపులారం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది గ్రామస్తుల మన్ననలు పొందేలా పని చేస్తానన్నారు. మిగిలిపోయిన సీసీ రోడ్లు, మురుగుకాలువలు, వీధి దీపాల ఏర్పాటుకై శక్తివంచన లేకుంగా కృషి చేస్తానన్నారు. ఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు. ఫుట్‌బాల్ గుర్తుకు ఓటువేయాలని గ్రామస్తులను వేడుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపించండి

కేశంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపెడుతానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, కేశంపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామాలలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కేశంపేట మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చామని వివరించారు. కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ అభివృద్ధి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని తెలిపారు. అలాగే కేశంపేటలో ర్యాలీలో పాల్గొన్నారు. ఏఎంసీ కమిటీ వైస్‌చెర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, పల్లె ఆనంద్ కుమార్, రమేష్, రమణ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాలను ప్రగతి బాటలో నడిపిస్తా

- కడ్తాల కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి


కడ్తాలలో కత్తెర గుర్తు చూపిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న రాయికంటి భిక్షపతి

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాబట్టి కడ్తాలను ప్రగతి బాటన నడిపిస్తానని కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ జెండా పేదలకు కొండంత అండ అని ఆయన అన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం వివిధ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తు కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మాలె మల్లేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కుల, మహిళ, యువజన సంఘాలను కలిసి ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. హామీలు ఇవ్వకుండా అభివృద్ధిచేసి చూపుతానని భిక్షపతి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున తనను గెలిపిస్తే ప్రత్యేక నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిల సహకారంతో కడ్తాల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తానన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహ, హన్మనాయక్‌లు అన్నారు. ఫ్యూచర్‌సిటీకి చేరువలో ఉన్న కడ్తాల వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అభివృద్ధిని కాంక్షించి ప్రజలంతా కాంగ్రెస్ అభ్యర్థి భిక్షపతిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు రాంచందర్ నాయక్, రవి, జహంగీర్‌అలీ, గుర్రం కేశవులు, జ హంగీర్‌బాబా, మూడ రవి, కాలే వెంకటేశ్, బోసు రవి, రాజేశ్, రాజేందర్‌గౌడ్, యాదయ్య, సత్యంయాదవ్, జంగారెడ్డి, చందోజీ, యాదగిరిరెడ్డి, వరికుప్పల కృష్ణయ్య, రమేశ్, మహేశ్, శ్రీకాంత్, మల్లయ్య, జంగయ్య, ఇమ్రాన్ బాబా, బుచ్చయ్య, మంకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో శ్రీనివాస్ రెడ్డి, ఆసిఫ్‌అలీతో రాయికంటి భిక్షపతి

నిండు మనస్సుతో ఆశీర్వదించండి

- కమ్మెట సర్పంచ్ అభ్యర్థి బుడ్డ సతీశ్‌గౌడ్


కమ్మెట గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి బుడ్డ సతీశ్‌గౌడ్


సతీశ్‌గౌడ్

చేవెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కమ్మెట గ్రామ ప్రజలు నిండుమనస్సుతో ఆశీర్వదించి ఉంగరం గుర్తుకు ఓటువేసి తనను భారీ మోజార్టీతో గెలిపించాలని కమ్మెట సర్పంచ్ అభ్యర్థి బుడ్డ సతీశ్‌గౌడ్ కోరారు. మంగళవారం చేవెళ్ల మండలం కమ్మెట గ్రామ పంచాయతీ పరిధిలోని మాజీ సర్పంచులు పాండురంగం, పెంటయ్య, రాంచంద్రయ్య, పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి, తులసీరాజు, మాజీ ఎంపీటీసీ జంగయ్య ఇతర నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని చెబుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2018 వరకు గ్రామంలో తమ కుటుంబం తాగునీటి ఇబ్బందిని తీర్చేందుకు తన వ్యవసాయ పొలం నుంచి సరిపడా నీటిని ఉచితంగా సరాఫరా చేసినట్లు గుర్తుచేశారు. సర్పంచ్‌గా అవకాశమిస్తే గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజన్‌గౌడ్, నాయకులు మాధవగౌడ్, పాండుగారెడ్డి, వెంకటేశ్, సురేందర్‌గౌడ్, సుబాన్‌రెడ్డి, రామకృష్ణ, సుధాకర్, దర్శన్, కాంత్, రాజు, గోపాల్, జంగయ్య, వెంకటేశ్, హన్మయ్య, అంతయ్యగౌడ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పంచవర్ష ప్రణాళికతో గంట్లవెల్లి అభివృద్ధికి కృషి


బాండ్ పేపర్‌తో సర్పంచ్ అభ్యర్థి శివకుమార్ యాదవ్


ప్రచారం నిర్వహిస్తున్న చక్కటి శివకుమార్ యాదవ్

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని పంచవర్ష ప్రణాళికతో సమగ్ర అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ మద్దతు గంట్లవెల్లి సర్పంచ్ అభ్యర్థి చక్కటి శివ కుమార్ యాదవ్ గ్రామస్తులకు బాండ్ రాసిచ్చారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రతీ ఇంటికి మినరల్ వాటర్ ఉచితంగా పంపిణీ చేస్తానన్నారు. పదిహేను రోజులకొకసారి ఈగలు, దోమల మందు పిచికారీ, మూడు నెలలకొకసారి ఉచిత మెడికల్ క్యాంపు, బీసీల కోసం మోడల్ హౌజింగ్ కాలనీ, పాఠశాలను డిజిటల్ స్కూల్‌గా మార్చు చేస్తామన్నారు. ముస్లింలకు కమ్యూనిటీ హాల్, ఈద్గా నిర్మాణం చేపడతామన్నారు. బీసీల శ్మశానవాటికకు రోడ్డు నిర్మిస్తామని, పశువుల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఎస్సీల కోసం కొత్త కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. యువకులకు గ్రౌండ్ ఏర్పాటు చేయిస్తామని, గ్రామంలో కల్యాణ మండపం నిర్మిస్తానని శివకుమార్ యాదవ్ తెలిపారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

షాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామ పంచాయితీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. మంగళవారం షాబాద్‌లో బాలికల ఉన్నత పాఠశాలలో 2వ విడత సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు.

ఆదరించండి.. ఆదర్శ జీపీగా తీర్చిదిద్దుతా

- పెద్దషాపూర్ సర్పంచ్ అభ్యర్థి దేవులపల్లి సునీత సత్యనారాయణగౌడ్


పెద్దషాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సునీత సత్యనారాయణగౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒక్కసారి ఆదరించండి ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని పెద్దషాపూర్ సర్పంచ్ అభ్యర్థి దేవులపల్లి సునీత సత్యనారాయణగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసారి ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రతీ ఇంటికి తాగునీరు, మురుగు కాల్వల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, విద్యుద్దీపాల ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. అలాగే విద్య, వైద్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నేరువేరుస్తానని చెప్పారు. అందరి సహకారంతో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. అన్నివర్గాల మద్దతు కావాలని ఆమె కోరారు. గతంలో సర్పంచ్‌గా చేసి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కత్తెర గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే పెద్దషాపూర్‌ను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దతామని చెప్పారు. మహిళలకు పింఛన్లు, రేషన్ కార్డులు సమస్యలు లేని గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, ఇప్పటికే గ్రామంలోని ఆలయంలో సొంత నిధులతో మార్బుల్ వేయించామని చెప్పారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కత్తెర గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అవకాశం కల్పిస్తే గ్రామం రూపురేఖలు మారుస్తానని చెప్పారు. ఇంటింటికీ ఫిల్టర్ నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కత్తెర గుర్తును చూపిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసారి ఎలాగైనా పెద్దషాపూర్ గడ్డపై జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాదె రాజశేఖర్, రఘువీర్ పండిట్, దేవులపల్లి నర్సింహ, శ్రీశైలం యాదవ్, యువ నాయకులు జిల్లా జగదీష్, కపిల్‌దేవ్, జిల్లా విశాల్, గాదె రామ్మోహన్, కుక్కల నరసింహ, బొర్ర చంద్రశేఖర్, ఉదయ్‌గౌడ్, శ్రీధర్‌బాబు, సయ్యద్ గౌడ్ పాషా, కర్రే శ్రీనివాస్, యాదయ్య, రాజు, జిల్లా శ్రీనివాస్, కిషోర్, జేమ్స్, నవీన్, ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ అభ్యర్థి సునీత సత్యనారాయణగౌడ్‌కు మద్దతు తెలుపుతున్న వివిధ వర్గాల ప్రజలు


కత్తెర గుర్తుకు ఓటు వేయాలని వృద్ధ దంపతులను కోరుతున్న సునీతమ్మ